సాక్షి ప్రకాశం

ఆదివారం । 12 । మార్చి । 2023



భారీ మెజారిటీతో గెలిపించండి

వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు. - 8లో..



రూ.1 కోటి భూమి హాం ఫట్

పొన్నలూరు చెరువులో 20 ఎకరాల భూములను టీడీపీ నాయకుడు కంచర్ల రామయ్య ఆక్రమించి కంచె వేసి వ్యవసాయ భూమిగా మార్చేశాడు. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32 /22

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

హోరు..జోరుగా..!

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైఎస్సార్ సీపీ పక్కా వ్యూహంతో ప్రచారాన్ని చేపట్టింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం చేశాయి. ఈ ఘట్టంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ముందుకు దూసుకుపోగా, పీడీఎఫ్, తెలుగుదేశం పార్టీలు బాగా వెనుకబడ్డాయి.

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఘట్టం
- పక్కా వ్యూహంతో వైఎస్సార్ సీపీ ప్రచారం
- వెనుకబడిన పీడీఎఫ్, టీడీపీ
- వైఎస్సార్ సీపీ తరఫున బాలినేని శ్రీనివాసరెడ్డి విస్తృత ప్రచారం
- మూడు జిల్లాల్లో విస్తృతంగా పర్యటన
- ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని బాలినేనిని ఆదేశించిన సీఎం జగన్
- జిల్లాలో మొత్తం 138 పోలింగ్ స్టేషన్లు
- రేపు పోలింగ్



ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకుపై ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థుల విజయం కోసం 25 రోజులుగా పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం చేపట్టాయి. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యాం ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి పోటీలో ఉన్నారు. ఈ మూడు జిల్లాల్లో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని పూర్తి స్థాయిలో భుజాన వేసుకున్నారు. ఇదిలా ఉండగా, పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా బాలినేనికి అప్పగించారు. దీంతో బాలినేని మూడు జిల్లాల్లో అలుపెరగకుండా తనదైన శైలిలో ప్రచారాన్ని చేపట్టారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ

▶ మిగతా 8లో..

పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

- ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. బేస్తవారిపేట దరగకొండపై శ్రీనివాస కళ్యాణ మండపంలో శనివారం ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట జంక్షన్‌లో భారీ గజమాలను క్రేన్ సహాయంతో నాయకులకు వేశారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మొదటిసారిగా గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను వైఎస్సార్‌సీపీ నిలబెట్టారని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు చేర్పించారని ప్రచారం చేస్తున్నాడని, ఎక్కడ ఉన్నాయో చూపించి మాట్లాడాలన్నారు. చంద్రబాబు వక్రబుద్ధి ఎన్నటికీ మారదని, 40 ఏళ్ల చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబుకు పొత్తులేనిదే పొద్దు పొడవదన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందన్నారు. ఆరు లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను గెలిపించడంతో ప్రజాసమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

సీఎం సామాజిక న్యాయం చేసి చూపించారు

18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం అంటే ఏమిటో

▶ మిగతా 8లో..



జంక్షన్‌లో బాలినేని, ఆదిమూలపు, అన్నా, జంకెకు భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

క్లుప్తంగా

పొగాకు దొంగలు అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు గ్రామంలో పొగాకు అపహరించుకుపోయిన దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం పసుపుగల్లు గ్రామానికి చెందిన వలేటి పేతురు పొలంలో పొగాకు మాయం కాగా స్థానిక పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. కేసులో పొగాకు దొంగలైన పొదిలికి చెందిన కొమ్ముల చిన సుబ్బయ్య, గాలిముట్టి వెంకటనర్సు, గాలిముట్టి బాబులను శనివారం తెల్లవారుజామున పులిపాడు రైల్వే బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు చక్రాల వాహనం, 8 క్వింటాళ్ల పొగాకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను దర్శి జడ్జి ఎదుట హాజరుపరిచారు.

రైల్వే వంతెన కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

ఒంగోలు: ఒంగోలు మండలంలోని కరవది–నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు రైల్వేస్టేషన్ల మధ్య గుండ్లకమ్మ రైల్వే వంతెన కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు శనివారం గుర్తించారు. మృతుని వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుంది. నీలి రంగు అరచేతుల చొక్కా, తెలుపు రంగు అడ్డచారలు గల నీలి రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఈ నెల 9న నెల్లూరు–విజయవాడ, 10వ తేదీ విజయవాడ–నెల్లూరు జనరల్ రైలు టికెట్లు ఉన్నట్లు గుర్తించారు. అంతకుమించి మృతుని వివరాలేమీ లభ్యం కాలేదని, ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్లు 94406 27647, 94905 66577, 99497 61057కు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ ఎస్సై వెంకటేశ్వర్లు కోరారు.

భారీ మెజారిటీతో గెలిపించండి

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు ఒకటో ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని త్రిపురాంతకంలో శనివారం ఓటర్లను కలిసి విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రైవేట్ ఉపాధ్యాయులకు సముచిత స్థానం కల్పించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించామన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో పరిశ్రమల ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 45 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు రానున్నారని, దీని ద్వారా ఆరు లక్షల మందికి ఉద్యోగవకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి వెంట ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ బిసి సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సీహెచ్ యల్లారెడ్డి, ఆలయాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పి.మల్లికార్జున్, పార్టీ నాయకులు డి.గోపాల్‌రెడ్డి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, నక్కా చిన్నత్రిపురారెడ్డి పాల్గొన్నారు. వ్యాపార సంస్థల ప్రముఖులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రైవేటు ఉపాధ్యాయులు కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు పలికారు.



త్రిపురాంతకంలో ప్రచారం చేస్తున్న మంత్రి సురేష్

హోరు..జోరుగా..!

▶ 7వ పేజీ తరువాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారిని స్వయంగా కలిసి అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనేక బహిరంగ సభలు, ఇంటింటి ప్రచారంలోనూ పాల్గొన్నారు. పార్టీ శ్రేణులను పూర్తి స్థాయిలో భాగస్వాములను చేసేందుకు బాలినేని అవిరళ కృషి చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలను సైతం భాగస్వాములను చేసి ముందుకు సాగారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేశారు. ఇలా అధికార పార్టీ పక్కా వ్యూహంతో ప్రచారాన్ని నిర్వహించగా, అటు పీడీఎఫ్, ఇటు టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో వెనకబడి పోయారనే చెప్పుకోవాలి. ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం 4 గంటలతో ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది.

మాట నిలబెట్టుకున్నాం...

ఇదంతా ఒక ఎత్తయితే సీఎం వైఎస్ జగన్ పట్టభద్రులారా ఆలోచించండి అంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వారి ముందుంచారు. ''అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో సరికొత్త సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాలు భర్తీ చేసి చరిత్ర సృష్టించాం. వివిధ శాఖల్లో మరో 20 వేలకుపైగా శాశ్వత ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆర్టీసీలోని 54 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వంలోకి తీసుకుని వారికి అండగా ఉన్నాం. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కలిపి 6 లక్షలకుపైగా కల్పించాం. దళారీలు, కమీషన్లు లేకుండా ఆప్కాస్ ద్వారా నెలనెలా ఠంచనుగా జీతాలు అందిస్తున్నాం. ఇప్పటికే వివిధ దశల్లో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చామని'' సీఎం వైఎస్ జగన్ గుర్తు చేశారు. 2014–19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ కేవలం 34 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని కూడా గుర్తు చేశారు. ఇంటింటికీ ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి నెలకు రూ.2 వేలు అని చెప్పి నిలువునా మోసం చేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు

ఎమ్మెల్సీ ఎన్నికల తేదీ 13-03-2023
పోలింగ్ సమయం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు

మూడు జిల్లాల్లో కలిపి	
పట్టభద్రుల ఓట్లు	: 3,81,181
పురుషులు	: 2,45,866
మహిళలు	: 1,35,284
ఇతరులు	: 31
పోలింగ్ స్టేషన్లు	: 453
మూడు జిల్లాల్లో కలిపి	
ఉపాధ్యాయ ఓట్లు	: 27,694
పురుషులు	: 16,825
స్త్రీలు	: 10,869
పోలింగ్ స్టేషన్లు	: 176

రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్

- పరిశీలించిన జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- డివిజన్లకు పోలింగ్ కేంద్రాల మార్క్‌డ్ కాపీలు

ఒంగోలు అర్బన్: పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించే ప్రక్రియలో భాగంగా ర్యాండమైజేషన్ విధానాన్ని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో శనివారం ప్రకాశం భవనంలో నిర్వహించి పరిశీలించారు. పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేసి ర్యాండమైజేషన్ చేసిన విధానాన్ని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని 138 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మార్క్‌డ్ కాపీలను పటిష్టమైన భద్రతతో జిల్లాలోని మూడు డివిజన్లకు ముగ్గురు సీనియర్ తహసీల్దార్ల ఆధ్వర్యంలో పంపారు. చనిపోయిన, మైగ్రేట్, పోస్టల్ బ్యాలెట్, గైర్హాజరు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను ఓటర్ల జాబితాలో మార్క్ చేసి వాటిని డివిజన్లకు పంపారు. ఈ మార్క్‌డ్ కాపీలు ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు సెట్‌ల చొప్పున ఆదివారం డివిజన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బందికి అందజేస్తారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, సీపీవో వెంకటేశ్వర్లు, రిటైర్డ్ తహసీల్దార్లు రాజ్యలక్ష్మి, ప్రసాద్, రాజు, తహసీల్దార్లు మురళి, వెంకటేశ్వర్లు, రవి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్

అవినీతికి పాల్పడితే సహించం

- డ్వామా పీడీ శీనారెడ్డి

మార్కాపురం: ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడితే సహించేది లేదని డ్వామా పీడీ శీనారెడ్డి హెచ్చరించారు. మండలంలోని రాయవరం సీఎల్‌ఆర్‌సీ భవనంలో మార్కాపురం, తర్లుపాడు, గిద్దలూరు మండలాలకు సంబంధించి శనివారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈజీఎస్ ద్వారా 433 పనులు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా 75, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 5, సర్వ శిక్ష అభియాన్ ద్వారా 13 పనులు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. తర్లుపాడు మండలంలో మొత్తం 560 పనులు చేపట్టగా ఇందులో ఉపాధి హామీ పథకంలో 465, పంచాయతీరాజ్ ద్వారా 67, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 6, సర్వశిక్ష అభియాన్ ద్వారా 15, అటవీ శాఖ ద్వారా 7 పనులు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. గిద్దలూరు మండలంలో మొత్తం 957 పనులు జరగ్గా ఈజీఎస్ కింద 878, పంచాయతీరాజ్ కింద 78, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో ఒక పని జరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహులు, డీవీఓ వెంకటస్వామి, అంబుడ్స్‌మెన్ మీరావలి, స్టేట్ రిసోర్సు మాధవరావు, ఏపీఓ జీవరత్నం పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శీనారెడ్డి

క్రీడలకు సంపూర్ణ అవకాశం

- వచ్చే నెలలో అకడమిక్ బ్లాక్ తరలింపు
- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: క్రీడలకు సంపూర్ణ అవకాశం కల్పిస్తానని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. శనివారం ఉదయం స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన మహిళా కబడ్డీ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రారంభమయ్యాక తొలిసారిగా క్రీడలు నిర్వహించే అవకాశం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా లభించిందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా తక్షణ చర్యలు చేపడుతున్నామని, వచ్చే నెలలో అకడమిక్ బ్లాక్‌ను పేర్నమిట్ట కొండపైకి మారుస్తామని తెలిపారు. ఖేలో ఇండియా కో ఆర్డినేటర్ వినాయక్ మాట్లాడుతూ మహిళల్లో క్రీడాసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందంటూ సోదాహరణంగా వివరించారు. యూనివర్సిటీకి క్రీడా నిధులు కూడా త్వరలో విడుదలవుతాయని, తద్వారా క్రీడలను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ దంత వైద్యురాలు డాక్టర్ హిమ శిల్ప మాట్లాడుతూ ఇటీవల మహిళల్లో ఎక్కువగా పీసీఓడీ సమస్య కనిపిస్తోందని, అందుకు కారణం సరైన వ్యాయామం లేకపోవడమేనని అన్నారు.

తాను టెన్నికాయిట్‌లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచానని, ప్రతిఒక్కరూ కనీసం రోజుకు ఒక గంటైనా వ్యాయామం చేయాలని సూచించారు. జిల్లా క్రీడాశాఖ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి మాట్లాడుతూ తమ క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించుకునేందుకు యూనివర్సిటీ అధికారులకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. మహా ఫౌండేషన్ అధ్యక్షురాలు నల్లమల్లి శిల్ప విజేతలకు బహుమతులు అందించారు. మొదటి బహుమతిని ఈతముక్కలకు చెందిన పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థినుల జట్టు, రెండో బహుమతిని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ జట్టు, తృతీయ బహుమతిని అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థినుల జట్టు కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫిజికల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ ఐ.దేవీవరప్రసాద్, డాక్టర్ అమృతవల్లి పర్యవేక్షించారు.



మొదటి బహుమతి అందుకుంటున్న ఈతముక్కల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థినుల జట్టు



రెండో బహుమతి అందుకుంటున్న దామచర్ల సక్కుబాయమ్మ కాలేజీ జట్టు



తృతీయ బహుమతి అందుకుంటున్న అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ జట్టు

మిర్చి కూలీల ఆటో బోల్తా

- ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయలపాలైన కూలీలు

దొనకొండ: కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సిద్ధాయపాలెం సమీపంలో శనివారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం 10వ వార్డుకు చెందిన దాదాపు 12 మంది మహిళలు మిర్చి కోతకు కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని నారపురెడ్డిపల్లెకు ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో సిద్ధాయపాలెం గ్రామ సమీపంలో అకస్మాత్తుగా అడవి పంది రోడ్డుకు అడ్డంగా రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన ముగ్గురు మహిళలను మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



పోలీస్ స్పందన రద్దు

ఒంగోలు: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 13న రద్దు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా కార్యాలయానికి రావొద్దని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మార్టూరు: ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు రావడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈఘటన స్థానిక జాతీయ రహదారిపై రాజుపాలెం సెంటర్లో శనివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన వాటర్ ప్లాంట్ నిర్వహించే పఠాన్ మొహిద్దీన్ (49) చిలుకలూరిపేట నుంచి బైక్‌పై మార్టూరు వస్తున్నాడు. రాజుపాలెం సెంటర్ సమీపంలో యలవర్తి కోల్డ్ స్టోరేజ్ ఎదురుగా హఠాత్తుగా అడ్డు వచ్చిన కుక్కను తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పింది. దీంతో మొహిద్దీన్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది నాగేశ్వరమ్మ ప్రమాదస్థలికి చేరుకుని పరీక్షించేసరికి మొహిద్దీన్ మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు...

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు కార్డు లేని వారు ఎలక్షన్ కమిషన్ అనుమతించిన ఇతర గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను ప్రత్యామ్నాయంగా చూపవచ్చన్నారు. ఆ జాబితాలో ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రైవేటు పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగులుగా ఉంటే.. వారు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అయితే వారికి జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, విద్యా సంస్థల్లో ఉద్యోగులు వారికి జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, యూనివర్సిటీల్లో జారీ చేసిన ఒరిజినల్ డిగ్రీ, డిప్లొమా సర్టిఫికెట్ వంటివి చూపవచ్చని వివరించారు. వీటిలో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

▶ 7వ పేజీ తరువాయి

చేసి చూపించారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఎస్సీలలోని రెండు ఉపకులాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ఎస్టీ కులానికి పెద్దపీట వేశారన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన తరగతులకు ఉన్నత స్థానం కల్పించారని చెప్పారు. టీడీపీ పాలనంతా అవినీతిమయం, వేలకోట్లు దోచుకున్నారని, నేడు టీడీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ఉద్యోగుల అనేక సమస్యలను పరిష్కరించారని చెప్పారు. టీచర్స్‌కు పదోన్నతులు, 1998–డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు, రూ.3 వేల కోట్ల బకాయిలు విడుదల చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు బురదజల్లుతున్నారని, వాస్తవాలను వివరించి, ప్రతి ఓటరుతో ఓటు వేయించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ 13 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్ట్‌ను పట్టించుకోలేదని, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలో పూర్తి కానుందన్నారు. ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవడంతో శాసనమండలిలో సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పాలు పంచుకుంటానని, మీ ఇంటి బిడ్డగా ఆదరించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు అన్నా కృష్ణచైతన్య, నియోజకవర్గ పరిశీలకుడు బంగారు శ్రీనివాసులు, సత్తెనపల్లి పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, బేస్తవారిపేట, అర్థవీడు, కంభం మండలాల ఎంపీపీలు వేగినాటి ఓసూరారెడ్డి, మేడూరి వెంకట్రావ్, చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు, గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని